24న పార్వతీపురంలో మంత్రి బొత్స పర్యటన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఈనెల 24న పార్వతీపురం జిల్లా కేంద్రంలో మంత్రి బొత్స సత్యనారాయణ పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం పూర్తి అయిన సందర్భంగా భారీ ర్యాలీ, అనంతరం పాత బస్టాండ్ లో బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చెత్తను తొలగిస్తున్న కార్మికులు

బతుకు పోరాటం

- వెట్టిచాకిరీ నుంచి విముక్తికి ఆందోళనలు
- 24న చలో విజయవాడకు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు బతుకు పోరాటం చేస్తున్నారు. తమకు పనికితగ్గ వేతనం ఇవ్వాలని, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కలిగించాలని, ఉద్యోగ భద్రత కలిపించాలని కోరుతున్నారు. ఇందుకోసం దశల వారీగా నెల రోజులుగా పోరాటం సాగిస్తున్నారు. ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు 24న చలో విజయవాడ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీల్లో 350 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు.వీరిలో పారిశుధ్య కార్మికులతో పాటు వాటర్ వర్క్స్, పంపు హౌస్, వాటర్ సప్లయ్, ప్లాంటేషన్ కార్మికులు, క్లాప్ వాహన డ్రైవర్లు ఉన్నారు. వీరంతా తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లకు, స్థానిక ఎమ్మెల్యేలకు వినతులు అందజేశారు. అయినా ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పనులు బంద్ చేసి ఈనెల 24న చలో విజయవాడకు తరలి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, టైమ్ స్కేల్ వర్తింప చేయాలని కార్మికులు కోరుతున్నారు.

అధికారంలోకి వేస్తే సమాన పనికి సమాన వేతనం, సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నారు. ఆప్కాస్‌లో ఉన్న కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్ డబ్బులు చెల్లించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి, రిస్క్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రోజూ రోజుకు పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచకపోవడంతో పని భారం అధికంగా ఉంది. రక్షణ, భద్రతా సౌకర్యాలు, పనిముట్లు సకాలంలో ఇవ్వడం లేదు. దీంతో కార్మికులు రోగాల బారిన పడి మరణిస్తున్నారు.

అరకొర వేతనాలతో క్లాప్ వాహన డ్రైవర్లు

క్లాప్ వాహన డ్రైవర్లకు అరకొర వేతనాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. తమకు రూ.18,500 జీతం చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. ఇవన్నీ రాష్ట్ర వ్యాప్త సమస్యలు అయితే స్థానికంగా అనేక సమస్యలు కార్మికులు ఎదుర్కొంటున్నారు. వాటిలో ప్రధానంగా రామతీర్థాలు, ముషిడిపల్లి, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్‌లో పనిచేస్తున్న 70 మందిని టర్న్‌కీ సిస్టం రద్దు చేసి ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్లాంటేషన్ విభాగంలో 60 మందిదీ అదే పరిస్థితి. ఆప్కాస్ వచ్చిన తరువాత ఏడుగురు కార్మికులు రిటైర్ అయ్యారు, వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. 2020 ఆగస్టు 1 తరువాత మరణించిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షలు ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. మరోవైపు ప్రభుత్వం 3నెలలుగా హెల్త్ అలవెన్స్ బకాయి చెల్లించాల్సి ఉంది. అంతే కాకుండా యూనిఫాం, గ్లౌజులు, చెప్పులు, నూనె వంటి రక్షణ పరికరాలు రెండేళ్లగా పంపిణీ చేయక పోవడంతో కార్మికులు రోగాలు భారిన పడుతున్నారు.

పెత్తనం చెలాయించే వారు అధికం

మున్సిపల్ కార్మికులపై పెత్తనం చెలాయించే సిబ్బంది ఎక్కువయ్యారు. సచివాలయ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్మికులను చిన్న చిన్న కారణాలకు కూడా ఎలాంటి నోటీసులు లేకుండా రోజుల తరబడి పనులు నుంచి నిలుపుదల చేస్తున్నారు. మరోవైపు పెరుగుతున్న పని భారం, ఒత్తిడి కారణంగా అనేకమంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో ఉద్యోగ భద్రత, పనికి తగ్గ వేతనం కోసం జరుగుతున్న పోరాటంలో చలో విజయవాడ కార్యక్రమం ద్వారా కార్మికులు సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

పర్మినెంట్ చేయాల్సిందే!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని ప్రకటించారు. మహాసంకల్ప యాత్రలో భాగంగా విజయనగరం కొత్తపేట వద్ద జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చాం. 'మున్సిపల్ కార్మికుల కాళ్లు కడిగి ఆ నీళ్లను నెత్తిన జల్లుకున్నా వారి రుణం తీర్చుకోలేనిది . లక్ష రూపాయలు జీతం ఇచ్చిన తక్కువే. మూడు నెలలు ఆగండి మన ప్రభుత్వం వస్తుంది. అందర్నీ పర్మినెంట్ చేస్తాం' అంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా పర్మినెంట్ చేయలేదు. పర్మినెంట్ చేసి మాట తప్పని మడం తిప్పని నేతగా ముఖ్యమంత్రి రుజువు చేసుకోవాలి. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

- ఎన్‌వై నాయుడు,
మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి

కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ధరలు పెంచుతున్న పాలకులకు బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి - బలిజిపేట

పేదలనడ్డి విరచి నిత్యవసర వస్తువుల ధరలు పెంచుకు పోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం దగ్గర పడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు తలపెట్టిన నిరసన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రజల సమస్యలు పరిష్కరించకపోగా రోజు రోజుకు అడ్డూ, ఆపూ లేకుండా నిత్యవసర వస్తువు ధరలు పెంచుకు పోతుందన్నారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజానీకం పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంస్కరణల వల్ల విపరీతంగా కరెంట్ బిల్లులు పెంచుతూ ప్రజల మాడు పగలగొడుతుందని అన్నారు. యువతకు ఉద్యోగం, ఉపాధి కరువై నిరుద్యోగులు తిరుగుతున్నారని, పేదరికం పెరుగుతుందని, ప్రజలు సమస్యలు పట్టించుకోకుండా మతాలపేరిట మతోన్మాదం రగిలించి దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందని విమర్శించారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య గొడవలు సృష్టించి అక్కడ ప్రకృతి సంపదను కార్పొరేటర్లు కట్టబెట్టాలని దారుణమైన ఆలోచనలతో మహిళలను నగ్నంగా ఊరేగించి, భయభ్రాంతులకు గురి చేస్తూ మహిళలకు రక్షణ లేకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. కావున ఈ సమస్యలను నిరసిస్తూ ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు జరుగు ప్రచార, నిరసన కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో సిపిఎం నాయకులు వి.సత్యనాయుడు. గేదెల సత్యనారాయణ, వై.మన్మధరావు, ఆవు సాంబమూర్తి, గంట్యాడ బలరాం, బొడ్డాన భానుమూర్తి, దన్నాన త్రినాధ, పీసా వెంకటస్వామి, యు.లక్ష్మి, యమ్మల మన్మధరావు పాల్గొన్నారు

గరుగుబిల్లిలో మూతపడ్డ ఆధార్ నమోదు కేంద్రం

పనిచేయని ఆధార్ కేంద్రం

- పట్టించుకోని అధికారులు
- నిరాశతో వెనుదిరిగిన ప్రజలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల కేంద్రంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో కంప్యూటర్ మొరాయించింది. గరుగుబిల్లితో పాటు సచివాలయం పరిధిలో గల గ్రామస్తుల సౌకర్యార్థం ఇక్కడ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే గత నెల రోజులుగా పని చేయకపోయినా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఆధార్ కేంద్రం పనిచేయలేదన్న విషయం కూడా అధికారులు తెలియజేయకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయం కనీసం ప్రజలకు సమాచారం ఇవ్వకపోవడంతో ఆధార్ సేవలు నిమిత్తం వస్తున్న వారు నిరాశతో వెనుతిరుగుతున్నారు. దాదాపుగా నెలరోజులు పైబడుతున్నప్పటికీ ఆధార్ సెంటర్ మరమ్మతులు చేపట్టకపోవడం శోచనీయమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు గరుగుబిల్లి, రావివలస, ఉల్లిభద్ర గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నామని ఎంపిడిఒ జి.పైడితల్లి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే గరుగుబిల్లి సచివాలయంలోని ఆధార్ కేంద్రం దాదాపు నెలరోజులు పైబడి తెరుచుకోలేదన్న విషయం ఎంపిడిఒకు తెలియకపోవడం శోచనీయమని పలువురు అంటున్నారు. అదేవిధంగా ఆధార్ కేంద్రం మరమ్మతులకు గురైన విషయాన్ని గ్రామ సచివాలయ అధికారులు మండల పరిషత్ కార్యాలయానికి ఎందుకు తెలియజేయడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరమ్మతులకు గురైన విషయం తెలియని పలు గ్రామాల ప్రజలు సచివాలయంలోని ఆధార్ కేంద్రం ప్రత్యేక శిబిరానికి పలు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. ఆధార్ కేంద్రం మరమ్మతులకు గురైన విషయమును తెలుసుకోకుండా పత్రికా ప్రకటన ఎలా ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కంప్యూటర్ మరమ్మతులు చేసి వెంటనే సేవలందించాలని కోరుతున్నారు.

నాణ్యత పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పిహెచ్‌సిల్లో నాడు-నేడు కింద చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని రోడ్లు, భవనాల శాఖాధికారులను కలెక్టరు నిశాంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో వైద్య, ఆరోగ్యశాఖపై వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు కావలసిన మౌళిక సదుపాయాలు, సిబ్బంది నియామకం ఎప్పటికప్పుడు ప్రభుత్వం సమకూర్చుతుందని, కావున వైద్యులు నిబద్ధతతో పనిచేసి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు. ప్రసవ మరణాలు సంభవిస్తే నామమాత్రపు చర్యలతో ఉపేక్షించడం కుదరదని, భవిష్యత్తులో ప్రసవ మరణాలు సంభవిస్తే అందుకు బాధ్యులైన అధికారులు, సిబ్బంది భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మలేరియా, డెంగీ జ్వరాల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని, స్ప్రేయింగు పూర్తికాని గ్రామాల్లో వెంటనే పూర్తిచేయాలని, ఒకే గ్రామంలో ఎక్కువ కేసులు వస్తే నియంత్రణ చర్యలు పాటించాలని తెలిపారు. జ్వరాల కేసులను నిరంతరం పర్యవేక్షించి, వారికి వైద్యమందించాలని తెలిపారు.

పిహెచ్‌సిల్లో నాడు-నేడుకింద చేపట్టిన పనులలో నాణ్యతా ప్రమాణాలు లేవని వైద్యాధికారులు తెలుపగా, పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు చేయడం జరిగిందని, నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లు పదిరోజుల్లో సరిదిద్ది పనులు పూర్తి చేయించాలని, పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను కలెక్టరు ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంటులో నమోదు ప్రక్రియ రెండు వారాల్లో పూర్తిచేయాలని కలెక్టరు తెలిపారు. యాప్ నమోదు ప్రక్రియను ఎఎన్ఎం స్థాయి వరకు తెలియజేయాలన్నారు. పిహెచ్‌సిల పరిధిలో సేవాలోపాలకు సంబంధిత మెడికల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, సరిగా పనిచేయని సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణులకు మెరుగైన సేవలందించేందుకు స్థానికులకు ప్రాధాన్యమిస్తూ ఆశా వర్కర్లను నియమించామని, సరిగా పనిచేయని ఆశా వర్కర్లపై నివేదిక సమర్పిస్తే, వారిపై చర్యలు తీసుకొని వారి స్థానంలో మరొకర్ని నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానికులు అందుబాటులో లేనప్పుడు స్థానికేతరులకు కూడా అవకాశమివ్వాలని తెలిపారు. వైద్యశాఖలో ఖాళీల నియామకానికి చర్యలు తీసుకోవాలన్నారు. సీతంపేట, సాలూరు, పార్వతీపురంలో భవన నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇంచార్జి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డి. భాస్కరరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంటు వాగ్దేవి, ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి కమిషనర్‌గా సూరినాయుడు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో ఎఇగా పని చేస్తున్న ఎల్.సూరినాయుడుకు పూర్తి అదనపు బాధ్యతలతో కమిషనర్‌గా నియమిస్తూ మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈనెల 9న అవినీతి నిరోధక శాఖ వలలో చిక్కిన కమిషనర్ హెచ్ శంకరరావును సస్పెండ్ చేశారు. దీంతో గత పదిరోజులుగా కమిషనర్‌గా ఎవర్నీ నియమించలేదు. మున్సిపాలిటీలో దైనందిన కార్యక్రమాలు స్తంభించిపోవడంతో ఎట్టకేలకు ఉన్నతాధికారులు ఎఇ సూరినాయుడుకు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఇన్‌ఛార్జి డిఇ గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రేసులో ముగ్గురు అధికారులు

మున్సిపల్ కమిషనర్ గా ఇక్కడ చేయడానికి ముగ్గురు అధికారులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. విశాఖపట్నం జివిఎంసిలో పని చేస్తున్న ఇద్దరు అధికారులు కమిషనర్‌గా రావడానికి పావులు కదుపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పాలకొండ నగర పంచాయతీ మేనేజర్‌గా పని చేస్తున్న అధికారికి డిప్యూటీ సీఎం రాజన్నదొర సిఫార్సు చేసినట్లు సమాచారం.

దీక్షల్లో పాల్గొన్న జ్యూట్‌మిల్లు కార్మికులు, నాయకులు

మహిళలు వ్యాపారవేత్తలుగా తయారవ్వాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

సంఘాల్లో ఉండే ప్రతి మహిళా ఒక వ్యాపారవేత్తగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు సమాఖ్య భవనంలో వెలుగు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల నిర్వహణ క్రమం తప్పకుండా సమావేశాలు వారి తీసుకున్న రుణాలు వినియోగం, రికవరీ ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న లబ్ది ప్రతి విషయంలో సిబ్బంది వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. వీరు ఉన్నతంగా ఎదగడానికి మనం బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో వెలుగు ఎపిఎం సింహాచలం, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

జ్యూట్ మిల్లు తెరిపించాలి

జెఎసి ఆధ్వర్యాన నిరసన దీక్షలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని జీగిరాంలో గల ఎపి ఫైబర్స్ జ్యూట్ మిల్లును వెంటనే తెరిపించాలని జెఎసి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను స్థానిక ఎంపిటిసి సభ్యులు సూరప్పలనాయుడు ప్రారంభించారు. జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి జరుగు ఈ దీక్షలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి జ్యూట్ మిల్లును తెరిపించాలని డిమాండ్ చేశారు. సాలూరు మండలం జ్యూట్ మిల్లు జెఎసి నాయకులు సింహాచలం, నారాయణరావు, శ్రీనివాసరావు, మారినాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు మాట్లాడుతూ 15 నెలలుగా జ్యూట్ మిల్లును యాజమాన్యం నిరవధికంగా మూసివేసిందని, దీనివల్ల, 2వేల మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందే వాళ్లంతా నేడు వీధిన పడ్డారని అన్నారు. కలెక్టర్, జిల్లా మంత్రి ఈ సమస్యపై దృష్టి సారించకపోవడం వల్ల నేటికీ పరిష్కారం కాలేదని, కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితిని పాలకులే కల్పించారని విమర్శించారు. న్యాయమైన ఈ సమస్య పట్ల కార్మిక వర్గం పక్షాన సిఐటియు నిలబడుతుందన్నారు. జ్యూట్ మిల్ కార్మికులు చేపడుతున్న కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని, జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ సాలూరు జ్యూట్ మిల్లును దీన్ని కాపాడుకోవడానికి ప్రజలు, కార్మికులు ఎంతటి పోరాటానికైనా సిద్ధపడాలని, సమస్య పరిష్కారానికి అధికారి యంత్రాంగం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉద్యోగులు, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు కార్మికులపై ప్రభావం అనే అంశంపై అంగన్‌వాడీ కొమరాడ ప్రాజెక్టు కార్యకర్తలకు నిర్వహించిన వైజ్ఞానిక తరగతుల్లో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆనందిస్తున్న విధానాలు కార్మికులకు, ఉద్యోగులకు తీవ్ర నష్టం చేకూర్చేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు పెంచకుండా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ఈ సమస్యలపై కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం ద్వారా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలు అణగారిన వర్గాలకు అందకుండా చేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పగించేందుకు కుల,మత ఘర్షణలను లేపుతున్నారని అందులో భాగంగానే మణిపూర్‌లో జరిగిన దుర్ఘటన అని ఉదహరించారు. శ్రామిక మహిళా నాయకులు వి.ఇందిర, జి.జ్యోతి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించాల్సిన ప్రభుత్వమే రాజ్యాంగస్ఫూర్తిని దెబ్బ తీయడం సరైంది కాదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాము అవలంబిస్తున్న తప్పుడు విధానాలు విరమించుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం కొమరాడ ప్రాజెక్ట్ , వివిధ సెక్టార్ల నాయకత్వ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో అంగన్వాడి ప్రాజెక్టు యూనియన్ నాయకులు సిహెచ్ గౌరమ్మ, ఎం.సావిత్రి, అనురాధ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

సీతంపేటలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో జలమయమైన రహదారి

సీతంపేటలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సుమారు గంటసేపు ఏకధాటిగా వర్షం కురవడంతో ఐటిడిఎ, వైటిసి, సివిల్ సప్లై గోదాం వరకు రహదారి జలమయమైంది. మడిగట్టు వాన కురవడంతో గెడ్డలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. కాలువ మాదిరిగా రహదారిపై నీరు ప్రవహిస్తుంది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

సాలూరు రూరల్ : మండలంలో మంగళవారం ఏడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చాలా వరకు అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు దమ్ములై, వరి నాట్లు వేశారు. గత 15 రోజుల నుంచి వర్షం కురవపోవడంతో పొలాలు ఎండిపోయాయి. మంగళవారం కురిసిన వర్షంతో వరితో పాటు మెట్టు పంటలైన మొక్క జొన్న, పత్తికు కూడా నీరు సమృద్ధిగా అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

ఆరో రోజుకు రిలే నిరాహార దీక్ష

ప్రజా కవి గంటేడ మద్దతు

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు లాబేసి వంతెన పనులను పూర్తి చేయాలని కోరుతూ వంతెన సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష మంగళవారం ఆరో రోజు కొనసాగింది. ఈ రిలే దీక్షకు ప్రముఖ రచయిత గంటేడ గౌర్నాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రంజిత్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రజలకు ఎంతో అవసరమైన వంతెన నిర్మాణం మధ్యలో నిలిపివేయడం దారుణమన్నారు. ప్రజలకు ఎంతో అవసరమైన వంతెన నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలి తప్ప ఇలా నిర్లక్ష్యంగా గాలికి వదిలేయడం సమంజసం కాదన్నారు. ముఖ్యంగా వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో నాగావళి నదిలో ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేసే దుస్థితి ఇక్కడికి ప్రజలకు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరుగుతున్నా కనీసం వంతెన నిర్మాణంపై ఎందుకు శ్రద్ధ వహించడం లేదో అర్థం కావడం లేదని తెలిపారు. మండలంలో 31 పంచాయతీలు సంబంధించి అందులో 9 పంచాయతీలకు అతిముఖ్యమైన వంతెన దేవుకోన పంచాయతీ పూర్ణపాడు -లాబేసు వంతెన పెండింగ్ పనులు పూర్తిచేసి గిరిజన ప్రాణాలు కాపాడాలని సాధన కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు కళ్లు తెరిచి ప్రజలకు ఎంతో అవసరమైన పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు ప్రారంభించి త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయాలని ఈ సందర్భంగా వారు కోరరు. ఈ రిలే నిరాహారదీక్షల్లో సాధన కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, బత్తిలి శ్రీనివాసరావు, పాలక నూకరాజు, పకీరు శంకర్రావు, లక్ష్మణరావు పోలి నాయుడు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీక్షలకు మద్దతు తెలుపుతున్న రచయిత గంటేడ గౌరునాయుడు, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి - సీతానగరం

15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపిడిఒ ఎం.ఎల్.ఎన్.వి ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల్లో ముందుగా జీతాలు చెల్లించుకోవాలన్నారు. అలాగే గ్రామ అభివృద్ధి పనులను ప్రారంభించి దీనికి పూర్తి చేయాలన్నారు. ఆకౌంట్లు ప్రారంభించిన కార్యదర్శులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా పాఠశాల బోరు మరమ్మతులు

ప్రజాశక్తి - కురుపాం

బోరును బాగుచేస్తున్న సిబ్బంది

స్థానిక గురు కుల పాఠశాలలో గత కొద్దిరోజులుగా బోరు పాడైపోవడంతో పాటు, పాఠశాల ఆవరణలో గడ్డి, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళ వారం స్వచ్ఛందంగా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపల్ సత్యవతి కలిసి పాఠశాల ఆవరణలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, గడ్డిపై మందులను పిచికారీ చేయించి, పాడైన బోర్లు బాగు చేయించారు.

సూడిగాంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని సూడిగాంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా డాక్టర్ ఐశ్వర్య వైద్య సేవలందించారు. ఈ వైద్య శిబిరంలో 58 మందికి చికిత్స అందించినట్లు ఆమె తెలిపారు. ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 18 రకాల రక్త పరీక్షలు నిర్వహించడమే కాకుండా గ్రామంలోనే మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరాలకు మంచి స్పందన లభిస్తుందని ఆమె అన్నారు.

మహిళలకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

పెద్దపొల్లలో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దపొల్ల సచివాలయం దుగ్గి పంచాయతీలో గడికరాం, కోసమానుగూడ, రాయలంక, దుగ్గిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మహిళా సాధికారతకు పెద్ద పీట వేయడం జరిగిందని, 99 శాతం పథకాలను మహిళల పేరుతోనే అందిస్తున్నామని తెలిపారు. మహిళలు సంక్షేమ పథకాలను తెలుసుకొని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. గ్రామాల్లో తిరిగి ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబాలను కలుసుకోవడంతో పాటు, వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, ఎఎంసి ఛైర్మన్ హిమరక మోహనరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి సవర రాము, స్థానిక సర్పంచ్‌లు, మండల ఉన్నత అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

ప్రజాశక్తి - బలిజిపేట

ఉపాధిహామీ చట్టం కింద 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టి పనులపై సామాజిక తనిఖీ బుధవారం నుంచి జరుగుతాయని ఎంపిడిఒ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 1392 పనులకు (పంచాయతీలకు, పశు సంవర్ధక శాఖ, సర్వ శిక్ష అభియాన్) వారికి రూ.19.70 కోట్లు సంబంధించి గ్రామ సభలు, తనిఖీలు జరుగుతాయన్నారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొనాలని ఆమె సూచించారు.

లంకజోడులో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని వలసబల్లేరు పంచాయతీ లంకజోడులో 104 ఆధ్యర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కన్సెప్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రవికుమార్ 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు, గర్భిణీలకు, బాలింతలకు శారీరక, పరిసరాల పరిశుభ్రత, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం లంకజోడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారికి తీసుకోవాల్సిన ఆహారం, వారికి శారీరక , పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది హెల్త్ విజిటర్ పెంటమ్మ, ఎంఎల్‌హెచ్‌పి లలిత, గౌరీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కన్నారావు, పాఠశాల హెచ్ఎం ఎ.శ్రీదేవి, వార్డెన్ జి.సునీత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోడు వ్యవసాయంతో ఉపాధి పనులు

ప్రజాశక్తి -సీతంపేట

వ్యవసాయ పనులను ఉపాధి హామీ పనులతో అనుసంధానం చేస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని సామాజిక వేత్త, నారీశక్తి అవార్డు గ్రహీత, టిడిపి నాయకులు పడాల భూదేవి అన్నారు. మంగళవారం పలు గిరిజన గ్రామాల్లో పర్యటించి కొండపోడు సాగుపై రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం పసుపు సాగులో కలుపుతీత పనులు చేపడుతుండగా మెట్టుగూడలో మంగళవారం గిరిజన మహిళలతో కలిసి భూదేవమ్మ కలుపుతీత పనుల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనులు పండించిన పసుపు సాగు ప్రయాసతో కూడిన పంటన్నారు. అయినప్పటికీ కష్టానికి తగిన ఫలితం దక్కడంలేదన్నారు. మొక్క దశ నుంచి పసుపు కొమ్ములు మార్కెట్‌కు తెచ్చేవరకు శ్రమిస్తే కూలి డబ్బులు కూడా రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తే వేతనమైనా మిగులుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బిడ్డిక జయలక్ష్మి పాల్గొన్నారు.

కలుపుతీతలో పాల్గొన్న భూదేవి

ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం

వాహన రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి భారీ వృక్షం కొమ్మ కూలింది. ఆ సమయంలో ఎటువంటి వాహనంగానీ, జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, పార్వతీపురం వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలకు తీవ్ర అంతరాయం కలిగింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎల్విన్‌పేట పోలీసులు, ఆర్ అండ్ బి అధికారులు స్పందించి జెసిబి సాయంతో మంగళవారం ఉదయం చెట్టు కొమ్మను తొలగించి రాకపోకలకు వీలు కల్పించారు. అయితే గుమ్మలక్ష్మీపురం నుంచి కురుపాం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి ఉన్న చెట్లుకు కాలం చెల్లడంతో అవి ఏ క్షణాన కూలుతాయో తెలియని పరిస్థితి. పలుమార్లు ఇదే విషయాన్ని పత్రికల్లో పలుమార్లు ప్రస్తావించినా ఆర్‌అండ్‌బి అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి విమర్శలు వస్తున్నాయి. చెట్లు కూలినప్పుడే మాత్రమే కనిపిస్తున్నారని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందుగా పోలీసులు స్పందిస్తున్న ఆర్ అండ్ బి అధికారుల జాడ మాత్రం కానరావడం లేదు. తరుచు ఈ ప్రాంతంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు కూలడం పరిపాటిగా మారింది. రెండు నెలల క్రిందట పి.ఆమిటి బస్ షెల్టర్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై చెట్టు కూలడంతో నడుము విరిగింది. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఉన్నత స్థాయి అధికారులైనా స్పందించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా వాహనదారులకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిపోయిన భారీ వృక్షం

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో పైడిరాజుకు సిల్వర్

ప్రజాశక్తి - సాలూరు

సిల్వర్ పతకం సాధించిన పైడిరాజు

ఈనెల 19 నుంచి 21 వరకు శ్రీలంక దియాగమలో నిర్వహించిన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొన్న కనకల పైడిరాజుకు సిల్వర్ మెడల్ లభించింది. మండలంలో మామిడి పల్లికి చెందిన పైడిరాజు వివాహమైనా అథ్లెటిక్స్‌పై ఆసక్తితో ప్రాక్టీస్ చేస్తూ పతకాలు సాధిస్తున్నారు. దేశీయంగా జరిగిన అనేక పోటీల్లో కూడా ఆమె పతకాలు సాధించారు. 35వ విభాగంలో పాల్గొన్న పైడిరాజు సిల్వర్ మెడల్ సాధించారు. పైడిరాజు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన మహిళ కావడంతో ఆమె ప్రయాణ ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం రాజన్నదొరతో పాటు కొంత మంది ఆమెకు ఆర్థికసాయం చేశారు. ఆమె గీతం మెడికల్ కళాశాలలో ఎఎన్ఎంగా పని చేస్తున్నారు. ఆమెలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి గీతం కళాశాల యాజమాన్యం కూడా సహకరించింది.

ప్రకృతి వ్యవసాయంతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతులు ప్రకతి వ్యవసాయం చేయడంతోనే మానవ మనుగడ సాధ్యపడుతుందని ప్రకృతి వ్యవసాయం రీజినల్ అధికారి జి.హేమ సుందర్ అన్నారు. మండలంలోని గొరడలో జట్టు పర్యవేక్షణలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో మా తోట జీవ పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమాలను పరిశీలించేందుకు వచ్చిన ఆయన రైతులతో మాట్లాడారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో వల్లాడ, గోరడ, పెంగవ, రాయగడ జమ్మూ గ్రామాలకు చెందిన 40మంది రైతులతో ఏడాది పొడవునా పంటలు పండించే విధానంపై అవగాహన కార్యక్రమం జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖ రాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం ద్వారా మానవ మనుగడ సాధ్యపడుతుందని, అందుకు ప్రతి రైతు తనకున్న విస్తీర్ణంలో ఏడాది పొడవునా పలు పంటలతో పాటూ, అంతర పంటలైన దుంప జాతులు, తీగ జాతులు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు మొదలగు పంటలు పండించుకోవచ్చని అన్నారు. ఈ పంటల్లో కొన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుని, మిగిలిన పరిమాణం రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా విక్రయించడం వల్ల అదనపు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వర్షాలు అనుకూలంగా ఉండడం వల్ల జీవామృతాలు ప్రతి రైతు తప్పనిసరిగా తమకున్న విస్తీర్ణంలో మూడు నుంచి ఐదు సార్లు వినియోగించాలని, ప్రకృతి వ్యవసాయంలోని అన్ని రకాల పద్ధతులు తూచా తప్పకుండా పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించడం సాధ్యపడుతుందని తెలిపారు. మా తోటల్లో ఏడాది పొడవునా పంటలు పండించేలా ప్రతి రైతు కృషి చేయాలని, అందుకు ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు రైతులకు అందుబాటులో ఉండి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. మండలంలోని ప్రకృతి వ్యవసాయాన్ని జట్టు సంస్థ, ఎపిసిఎన్‌ఎఫ్ ఉమ్మడిగా పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మా తోట జీవ రైతులకు బంతి, మిరప, టమాట నారులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా డిపిఎం పి.షణ్ముఖరాజు, ఎన్ఎఫ్ఎజి అన్నపూర్ణ, మా తోట కమిటీ అధ్యక్షులు టి.జమ్మయ్య, కార్యదర్శి కె.చిరంజీవి, కోఆర్డినేటర్ జి.ప్రబోధ్, జి.మురళీ మోహన్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురువు అవతారమెత్తిన రచయిత

ప్రజాశక్తి -కొమరాడ

పాఠ్యాంశ రచయితే ఆ పాఠం విద్యార్థులకు బోధించిన అరుదైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ విద్యాసంవత్సరంలో తొమ్మిదో తరగతి తెలుగువాచకంలో రంగస్థలం అనే పాఠ్యాంశం ప్రవేశ పెట్టారు. ఆ పాఠ్యభాగ రచయిత ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ళ భరణి ఆ పాఠ్యభాగాన్ని బోధించే ముందు అవగాహన కోసం ఒక కవితను ఉపాధ్యాయుడు బోధించాల్సి ఉంటుంది. ఆ కవిత శీర్షిక 'పాట' విద్యార్థులకు ఈ కవితను పరిచయ చేయడం ద్వారా పాటకున్న శక్తిని, ఔన్నత్యాన్ని సమాజాన్ని ప్రభావితం చేయడానికి, ప్రజాచైతన్య కోసం పాట ఎలా దోహదపడుతుందో అవగాహన పెంచడానికి అవసరమైన నేపథ్యాన్ని చెప్తూ పాఠం (రంగస్థలం) లోకి విద్యార్థుల్ని ప్రవేశపెట్టగలుగుతాడు ఉపాధ్యాయుడు. పాట పోషించే ప్రధాన భూమికను వివరించే ఈ కవితను బోధించడం విద్యార్థులకు కొత్త అనుభవాన్ని ఇస్తుంది. అయితే ఆ కవితను పార్వతీపురం ప్రాంతానికి చెందిన ప్రముఖ, కవి, రచయిత గంటేడ గౌరునాయుడు మాస్టారు రచించారు. మంగళవారం గౌరునాయుడు మాస్టార్ కొమరాడలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు "రంగస్థల" పాఠ్యాంశం గురించి, ఆయన రచించిన పాట అనే కవిత గురించి స్వయంగా విద్యార్థులకు బోధించారు. దీంతో విద్యార్థుల ఆనందానికి, సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. పాఠ్యాంశం రాసిన రచయితే బోధించడం తమకు కొత్త అనుభూతిని కలిగించిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కవి, రచయిత గంటేడ గౌరునాయుడు మాస్టారు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలకు దగ్గరగా, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బోధిస్తున్న కవి గంటేడ గౌరునాయుడు

మహాశక్తితో ప్రజలకు భవిష్యత్తు గ్యారెంటీ : టిడిపి

ప్రజాశక్తి - బలిజిపేట

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టనున్న మహాశక్తితో ప్రజల భవిష్యత్తు బాగుపడుతుందని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని సుభద్ర, మిర్తివలస గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన మహిళా మహాశక్తి, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు అధ్యక్షతన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ద్వారపురెడ్డి జగదీష్, బొబ్బిలి చిరంజీవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహాశక్తి, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో సుమారు 500 మంది మహిళలతో కలిసి విస్తత ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ మహాశక్తి, భవిష్యత్తు గ్యారెంటీతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ అరాచక అవినీతి పాలన ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కావున ఒక్కసారి ఆలోచించి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీదేవి, పెంకి పార్వతి, గొట్టాపు వెంకటనాయుడు, సీతారాం నాయుడు, చంద్రమౌళి, రామ్మోహన్ నాయుడు, క్లస్టర్ ఇంఛార్జులు ఎస్.రాంబాబు, జి.బాబ్జీ పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని గాడిదపాయి, తాడిపాయి, జయపురం పంచాయతీల్లో సీతంపేట మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం ఆధ్వర్యంలో మహాశక్తియాత్ర మంగళవారం నిర్వహించారు. మహాశక్తి ప్రచారకర్త తోయక సంధ్యారాణి గాడిదపాయి, తాడిపాయి, జయపురం పంచాయతీల్లో గల గ్రామాల్లో ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు ఆమెతో చెప్పుకున్నారు. అలాగే పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను భవిష్యత్తులో తెలుగుదేశం ప్రభుత్వం వస్తే పంచాయతీకి కావాల్సిన అన్ని సౌకర్యాలను నెరవేర్చుకోగలమని, నిమ్మక జయకష్ణను గెలిపించుకుంటేనే మన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఆరిక సువర్ణ, వరలక్ష్మి, రామారావు, భూషణ్, వరలక్ష్మి, శేఖర్, ఆనంద్, సవర సంతు, మోహన్, సవర తిక్కమ్మ, సరోజిని, స్థానిక మహిళా నాయకులు పాల్గొన్నారు.

బలిజిపేట : మహిళలతో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

గుమ్మలక్ష్మీపురం : మహాశక్తి యాత్రలో పాల్గొన్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

వైసిపి నాలుగున్నర ఏళ్లలో ఉపాధి కరువు

గుమ్మలక్ష్మీపురం : రానున్న 2024 ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కురుపాం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని సెంటర్‌గూడలో మహాశక్తి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గిరిజన అభివృద్ధి టిడిపితోనే సాధ్యమవుతుందన్నారు. వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో గిరిజనులు ఉపాధి అవకాశాల్లేక పెరుగుతున్న ధరలతో జీవనం సాగించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి వెంకటరావు, యూనిట్ ఇంచార్జి బుజ్జేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు నాగవేణి, కళావతి, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ కార్యదర్శి తాడంగి రామారావు, నియోజకవర్గ ఎస్ టి సెల్ కార్యదర్శి అడ్డాకుల నరేష్ ఉన్నారు.

25 వరకు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు తొలగింపులకు ఈనెల 25 వరకు సంబంధిత బిఎల్‌ఒలు చేపడుతున్నారని తహశీల్దారు మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్ల వయస్సు గల ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, సుదూర ప్రాంతాలకు, శాశ్వతంగా వెళ్లిపోయిన వారికి ఇక్కడ ఓటర్‌గా తొలిగించబడునని, మరణించిన వారిని గుర్తించి తొలగించబడునని అన్నారు. దీని కోసం స్థానిక అన్ని పార్టీలకు చెందిన నాయకులు తగు సూచనలను తెలియజేయాలని కోరారు. మండల టిడిపి అధ్యక్షులు అముదాల పరమేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే అధికారులు ప్రతి ఒక్క ఓటర్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఫారం 6,7 రాయాలని, ఓటర్ జాబితాలో ఎటువంటి తప్పొప్పులు లేకుండా ఎన్నికల డిటి పర్యవేక్షించాలని కోరారు, సమావేశంలో పలువురు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో కరెంట్ కోతలు సిగ్గుచేటు : జనసేన

ప్రజాశక్తి - బెలగాం

వర్షాకాలంలో విద్యుత్ కోతలు సిగ్గుచేటని, పాలకులు, అధికారుల చేతగాని తనానికి నిదర్శనమని జనసేన నాయకులు అన్నారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా నాయకులు వి.దాలినాయుడు అన్నాబత్తుల దుర్గాప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ గత కొంతకాలంగా పట్టణం, గ్రామీణ ప్రాంతం అన్న తేడా లేకుండా గంటల కొద్దీ విద్యుత్ కోతలు విధించడం దారుణమన్నారు. వర్షాకాలంలో విద్యుత్ కోతలు విధించడం హాస్యాస్పదమన్నారు. అర్ధరాత్రి వేళ ఇఎల్ఆర్ పేరుతో గంట, రెండు గంటలు అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పగలంతా పనిచేసుకొని ఇంటికి చేరిన కార్మికులు, ఉద్యోగులు తదితరులు నానా అవస్థలుపడుతున్నారన్నారు. అలాగే దోమలు విజృంభించి ప్రజలను వేధించుకు తింటున్నాయన్నారు. పాలకులు కరెంట్ బిల్లు పెంచడంపై చూపించే శ్రద్ధ ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడంలో చూపించడం లేదని విమర్శించారు. అప్రకటిత విద్యుత్ కోతలను ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా బుద్ధి చెబుతారన్నారు.

'తులసి'కి రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో తిత్తిరి పంచాయతీ తులసి గ్రామానికి రోడ్డు వేసి ప్రజారవాణా కల్పించాలని సిపిఐ నాయకులు టి.జీవ డిమాండ్ చేశారు. మంగళవారం రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సూరయ్య, సింగన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : ఇ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

15నాటికి ఇ-పంట నమోదు పూర్తి

ప్రజాశక్తి - పాచిపెంట

ఇ-పంట నమోదును సెప్టెంబరు 15నాటికి పూర్తిచేయాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు విఎఎలకు సూచించారు. వ్యవసాయ సిబ్బంది ఉదయం నుండి గ్రామాల్లో ఉండి ఇ- పంట నమోదు చేపడతారని, కావున రైతులంతా సహకరించి వారు ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన అన్ని పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. మండలంలోని మోసూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో ఇ-పంట నమోదును పరిశీలించిన అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడుతూ పంటల భీమా, నష్టపరిహారాలు, వ్యవసాయ సబ్సిడీలు, రుణాలు అన్ని ఇ-పంట నమోదుపై ఆధారపడి ఉన్నందున రైతులంతా తప్పనిసరిగా ఇ- పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలని, దండోరాలు వేయించాలని వ్యవసాయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో విఎఎ బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఈ పంట నమోదు కార్యక్రమాలు మండల మండల వ్యవసాయ అధికారి ఎస్ అవినాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటల వివరాలు ఈ పంట ద్వారా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి సచివాలయంలో గ్రామ సహాయకుల వద్ద ఈ పంట నమోదు కోసం రైతులు తెలిపి వారిని పంట నమోదు చేయాలన్నారు. దీనితో రైతులకు పంట అమ్ముకునే ముందు ఇటువంటి ఇబ్బందులు ఉండవని ఆయన అన్నారు.

కాలేజీల్లో 'మీ పోలీసు గురించి తెలుసుకోండి'

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో జాతీయ సేవా పథకం, నగర పోలీస్ ఆధ్వర్యంలో " మీ పోలీసు గురించి తెలుసుకోండి" అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్ఐ శివప్రసాద్ హాజరై విద్యార్థులకు పోలీసులు, వారి విధుల గురించి వివరించారు. బాధ్యత గల విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలంటే, ప్రస్తుతం క్రమశిక్షణతో విద్యను అభ్యసించి లక్ష్యం వైపు అడుగులు వేసి ఇప్పటి నుంచే భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. సమాజంలో మనకి గుర్తింపు రావాలంటే మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి పిల్లలైన మీరు మీ తల్లిదండ్రులకు మీ ఊరికి పేరు తీసుకురావడానికి చదువు ఒక్కటే మీ దగ్గర ఉన్న ఆస్తి అని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా చట్టంలో ఉన్న వివిధ చట్టాల గురించి, వాటి సెక్షన్ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, ప్రిన్సిపల్ పైల శంకర్రావు, సీనియర్ అభ్యర్థులు తేజేశ్వరరావు, నారాయణరావు, గిరిబాబు, వ్యాయామ ఆధ్యాపకులు నాగభూషణరావు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్థానిక పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాలకొండ పోలీసు శాఖ వారు నో యువర్ పోలీస్ కార్యక్రమాన్ని కళాశాలలో జరిగే స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై బి.శివప్రసాద్ పోలీసు శాఖ గురించి తెలుసుకో అన్న అంశంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు, వైస్ ప్రిన్సిపల్ బి.జయమణి, కోఆర్డినేటర్ బి రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ హరికృష్ణ

గుమ్మలక్ష్మీపురం : కళాశాల స్థాయి నుంచి విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఎల్విన్‌పేట ఎస్ఐ ఎస్.షణ్ముఖరావు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం అజాది కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పోలీస్, న్యాయ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసుల విధులను విద్యార్థులకు వివరించి అనంతరం చట్టాలు, పోలీసుల విధులపై విద్యార్థులతో చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యుగంధర్, వైస్ ప్రిన్సిపల్ ఎన్.అచ్చెన్నాయుడు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తి ఆత్మహత్య

సీతంపేట : మండలంలో బెత్తుపురానికి చెందిన సవరకిచ్చాయి (44) ఈనెల 15న చెట్టుకి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే బెత్తుపురానికి చెందిన కిచ్చాయికి చిల్లంగి ఉందన్న నెపంతో గ్రామస్తుల్లో ఇద్దరు స్తంభానికి కట్టేసి కొట్టేయడంతో అవమానంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ నీరకంఠరావు తెలిపారు. ఆయన భార్య లక్కమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పార్వతీపురం ఆర్టీసీ డిపోలో చోటుచేసుకుంది. పార్వతీపురానికి చెందిన పండిత రామారావు (39) పార్వతీపురం ఆర్టీసీ గ్యారేజ్ నుండి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సిబ్బంది జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రామారావు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి, పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి- విజయనగరం

పట్టణంలో అలకనంద కాలనీకి చెందిన వెంపడాపు వెంకటలక్ష్మి (20) అనారోగ్య సమస్యతో సోమవారం రాత్రి ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న రామకృష్ణ, రమణమ్మ దంపతుల కుమార్తె వెంకటలక్ష్మి గత కొంతకాలంగా తలనొప్పి సమస్యతో బాధపడుతుండడంతో చికిత్స చేయించుకున్న ఫలితం దక్కలేదు. కుట్టు పని చేసే వెంకటలక్ష్మి అనారోగ్య సమస్యలు తట్టుకోలేక మేడపై ఒక గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.